క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పంచప్రవ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను శుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవ రదస్వాములను అద్దాల మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య దూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి,అమ్మవార్లు పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు.

పెరిగిన ఆదాయం



రైతుల సమక్షంలో వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ చంద్రుడు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామం మాన్యం భూముల వేలం పాటల్లో ఆలయాలకు రూ.1.53లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్రుడు తెలిపారు. మంగళవారం శ్రీనాగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి 25.62, శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 26.42 ఎకరాల మాన్యం భూములను వేలం పాటలు నిర్వహించారు. ఈసందర్భంగా 11.73లక్షలకు వేలంపాడి పొలాలను కౌలుకు దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.1.53లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

గోస్పాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో దోమల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. వేస్ట్ ఆయిల్‌ను మురుగు నిల్వలపై పిచికారీ చేయాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు దోమల బారిన పడకుండా దోమతెరలను వాడాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఆరోగ్య, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



బోనాలతో గంగమ్మ ఆలయం వద్దకు వెళ్తున్న రజకులు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో నూతనంగా వెలసిన గంగమ్మ ఆలయంలో మంగళవారం 41రోజుల పండుగను ఘనంగా జరిపారు. ఉదయం నుంచే గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పండ్లు, పూలు, పిండివంటలు, నూతన చీరెలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు సగర సంఘం నూతన కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా సగర సంఘం నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు కర్నూలు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి సురేష్‌కుమార్ తెలిపారు. నంద్యాల నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు బోయిని బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాగా ఏర్పాటైన నేపథ్యంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక జంబులా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా సగరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టీవై శివయ్య, టీచర్ సుబ్బరాయుడు, ఎల్‌ఐసీ వెంకటేశ్వర్లు, చిన్నయ్య, వెంకటరాముడు, రామకృష్ణ, రామపుల్లయ్య, నవీన్, ఉపేంద్ర పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతతో అధిక దిగుబడులు

- సంతృప్త స్థాయిలో ఎరువులు, విత్తనాల పంపిణీ
- వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి
- నంద్యాల సబ్‌డివిజన్ స్థాయి సమావేశంలో డీఏఓ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(సెంట్రల్): వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటే అధిక దిగుబడులు పొందే ఆస్కారం ఉంటుందని.. గ్రామ స్థాయిలోని వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో 2024 ఖరీఫ్ ప్రణాళిక, కార్యాచరణపై సబ్‌డివిజన్ పరిధిలోని నంద్యాల, మహానంది, బండిఆత్మకూరుకు చెందిన వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు, ఏఈఓలకు ఏడీఏ డి.రాజశేఖర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయ సిబ్బంది రైతులకు కొత్త సాంకేతికతను ఎప్పటికప్పుడు పరిచయం చేసి, వారు అవలంబించేలా చూడాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఆయా గ్రామాల భౌగోళిక విస్తీర్ణం, పంటల వివరాలు, విత్తనాలు, ఎరువులు, మార్కెట్ పరిస్థితుల సమాచారం ఉండాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో జూన్ నెల సగటు వర్షపాతం 77.77 మి.మీ కాగా, ఇప్పటి వరకూ 214.28 మి.మీ వర్షం కురిసిందని తెలిపారు. పరిస్థితులు ఆశాజనకంగా ఉండడంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారని చెప్పారు. సిబ్బంది వారికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మొత్తం 4368 మట్టి నమూనాల లక్ష్యానికి గాను 55 శాతం పూర్తయిందని వెల్లడించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు 1482.5 క్వింటాళ్లు లక్ష్యం విధించగా, 3915 మంది రైతులకు 1433.8 క్వింటాళ్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. పిల్లి పెసర విత్తనాలు 67 మందికి 18.8 క్వింటాళ్లు అందజేశామని తెలిపారు. కౌలుకార్డుల లక్ష్యం 7898 కాగా ఆగస్టులోగా పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు 10,603 టన్నుల యూరియా, 6,647 టన్నుల డీఏపీ, 17359 టన్నుల కాంప్లెక్స్, 754 టన్నుల పొటాష్, 618 టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అవసరం ఉందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల(రైతు భరోసా కేంద్రాలు) ద్వారా 30 శాతం పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పీఎం కిసాన్‌కి సంబంధించి 5 శాతం రైతుల వెరిఫికేషన్ కింద 3447 రికార్డులను పరిశీలించాలన్నారు. ప్రస్తుతం 68 శాతం పూర్తి చేశామని, మిగతావి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నంద్యాల, మహానంది, బండిఆత్మకూరు ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ధర్మాన్ని పాటిస్తే దైవానుగ్రహం



ప్రవచనాలు చేస్తున్న ధర్మప్రచారకులు

గోస్పాడు: ధార్మిక వ్యాప్తితో సమాజంలో శాంతి నెలకొంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడులోని సోమనందీశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్త దాస్ శ్రీమద్రామాయణంపై ప్రవచనాలు చేశారు. ధర్మ రక్షణ ప్రతి మానవుని కర్తవ్యమని, ధర్మాన్ని పాటించినప్పుడే దైవానుగ్రహం కలుగుతుందని తెలిపారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సోమనందీశ్వరస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకంఠ నందీశ్వరశర్మ, సర్పంచ్ పరదేశి ప్రమీల, బాలన్న, గ్రామ వికాస భారతి జిల్లా అధ్యక్షుడు నాగరాజేష్‌కుమార్‌రెడ్డి, అర్చకుడు సురేష్‌శర్మ పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): న్యాయ వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ కేంద్రం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై నంద్యాల కోర్టులో రెండో రోజు మంగళవారం న్యాయవాదులు, పోలీసులకు అవగాహన కల్పించారు. ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అమలు అవుతాయన్నారు. మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు వాసు, రాధారాణి, ఏసురత్నం, ఆదినారాయణ శిక్షణ తరగతులు నిర్వహించారు. పిల్లలను కొనడం అమ్మడం కొత్త చట్టాల ప్రకారం తీవ్రమైన నేరం అని తెలిపారు. మైనర్‌పై సామూహిక అత్యాచారం చేస్తే జీవిత ఖైదు లేదా మరణ శిక్ష పడుతుందని పేర్కొన్నారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్‌ను దేశ వ్యాప్తంగా అన్నీ పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేస్తారన్నారు. కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాలరెడ్డి, శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భూపాని వెంకటేశ్వర్లు, వివేకానందరెడ్డి, జగన్‌మోహనరెడ్డి, కృష్ణలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

నంద్యాల(న్యూటౌన్): వైద్య సీట్ల భర్తీకి నిర్వహించే నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ గురువారం కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పీడీఎస్‌యూ నాయకుడు రాంబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



బాలస్వామి సన్మానిస్తున్న వైద్యులు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలస్వామి పదవీ విరమణ పొందారు. దీంతో మంగళ వారం పీహెచ్‌సీ వైద్యులు అమర్నాథరెడ్డి, గాయిత్రితో పాటు వైద్య సిబ్బంది, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు ఆయనను ఘనగా సన్మానించారు. పూలమాలలే వేసి శాలువాలతో సత్కరిచారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో సచివాలయ ఉద్యోగులు రెండో రోజు మంగళవారం పింఛన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో మొత్తం 6,401 మంది పింఛన్ దారులు ఉండగా 6,333 మందికి నగదు అందజేశామని అధికారులు తెలిపారు.

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి ఐదవ సచివాలయ పరిధిలోని గుంతపాళెం వీధిలో మంగళవారం పింఛన్ పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. ఎన్నికలలో టీడీపీ ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచి పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. మొత్తం పింఛన్ లబ్ధిదారులు 6,406 మంది ఉన్నారని, 6,342 మందికి నగదు అందజేశామని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ, ఏఓ రంగనేతాజీ, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, ఎంఈఓలు న్యామతుల్లా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకారంలో కృష్ణ భగవానుడు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చిత్తూరు వారి వీధిలో వెలసిన శ్రీకృష్ణ భజన మందిరంలో మంగళవారం ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామావాళి నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేద పండితుడు సుధీంద్రచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మినుము సాగుకు మొగ్గు



ఉయ్యాలవాడలో ట్రాక్టర్ సాయంతో మినుము విత్తనం వేస్తున్న రైతు

ఉయ్యాలవాడ : మండలంలో ఖరీఫ్ సీజన్ ఊపందుకుంది. ముందస్తుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 63 ఎంఎం కాగా 175 ఎంఎం నమోదైంది. ఎక్కువగా మినుము సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. అదేవిధంగా మొక్కజొన్న, వేరుశనగ, కంది పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వీటికి మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఇటీవల ఆయా ఉత్పత్తులకు సంబంధించి ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 2,725 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఉయ్యాలవాడ, హరివరం, ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, కొండుపల్లె గ్రామాల్లో మినుము, మొక్కజొన్న, కంది విత్తనానికి సమాయత్తమవుతున్నారు. అయితే మండల పరిధిలోని 11 రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏఓ రాజేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు తప్పా ఇతర రకాల విత్తనాలు, ఎరువులు సరఫరా కాలేదన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: మండలంలోని బాచ్చాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్(46) వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి చంద్రశేఖర్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు నంద్యాల తరలించగా అక్కడ ప్రాథమికి చికిత్స అనంతరం కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ

- ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పదవులకు వన్నె తెచ్చిన బీవీ
- రేపు 121వ జయంతి



బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పిలువబడుతున్న కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది.ఉపముఖ్యమంత్రి, స్పీకర్ పదవులకు వన్నె తెచ్చిన పట్టణానికి చెందిన దివంగత బీవీ సుబ్బారెడ్డి 121 జయంతిని గురువారం నిర్వహించేందుకు ఆయన వంశస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో పట్టణానికి చెందిన బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొర్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందడమేకాక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. బీవీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పది సంవత్సరాలపాటు శాసనసభ స్పీకర్‌గా పనిచేసి రేనాటిఖ్యాతిని నలువైపులా వ్యాపింప చేశారు.

పోక్సో కేసు నమోదు

డోన్ టౌన్ : మైనర్ బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నిందితునిపై అత్యాచారం, పోక్సో, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొండపేటకు చెందిన యువకుడు నాసిర్ (19) చిగురమానుపేటకు చెందిన ఒక మైనర్ బాలికను రెండేళ్లుగా ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. ఈనెల 1వ తేదీ బాలికలను తీసుకెళ్లి లైంగికవాంఛ తీర్చుకుని మంగళవారం ఇంటి వద్ద వదిలేసి వెళ్లాడు. ఈ విషయంపై బాధితురాలి తల్లి గట్టిగా నిదీయగా బాలిక అసలు విషయం చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది.

మురుగు కుంటగా దేవుని మాన్యం స్థలం



స్థలంలో మురుగునీటిని చూపుతున్న యూనిస్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని నడిగడ్డ సచివాలయం ఎదురుగా ఉన్న దేవుని మాన్యం స్థలం మురుగు కుంటగా మారిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ తెలిపారు. నీరు వెళ్లేలా చూడాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మంగళవారం మురుగు కుంట స్థలాన్ని పరిశీలించారు. మురుగు వల్ల దుర్గంధంతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నీరు వెళ్లే మార్గం చూపాలన్నారు.

గుర్తింపు మందులనే విక్రయించాలి



క్రిమిసంహారక మందు డబ్బాను పరిశీలిస్తున్న ఏఓ రాజేంద్రకుమార్

ఉయ్యాలవాడ : ప్రభుత్వంచే గుర్తింపు పొందిన క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు విత్తనాలను ఫర్టిలైజర్స్ నిర్వాహకులను ఏఓ రాజేంద్రకుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని మాయలూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లో గురు రాఘవేంద్ర ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఏజెన్సీ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన మందులతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు రైతులకు మందులు విక్రయించాలని, రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతుల నుండి ఫిర్యాదులు అందితే షాపులను సీజ్ చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

ఉపాధి రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాష్

ఉయ్యాలవాడ : ఉపాధి పనులకు సంబంధించిన వర్క్‌ఫైల్స్‌లోని 14 అంశాలు, 7 రకాల రికార్డులు నమోదు పకడ్బందీగా నిర్వహించాలి ఏపీఓ రవిప్రకాష్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో జూన్‌లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఉపాధిలో కూలీల సంఖ్య తగ్గిందన్నారు. క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటి వరకు చేపట్టిన పని ప్రదేశాలలో తప్పనిసరిగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

కొత్త చట్టాల అమలును వాయిదా వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల(న్యూటౌన్): కేంద్రం ఏకపక్షంగా తీసుకొచ్చిన నేర చట్టాలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని మండిపడ్డారు. భారత న్యాయ సంహిత చట్టం, భారత్ నగరిక్ సురక్ష సంహిత చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొని రావడం దుర్మార్గమన్నారు. ఈ చట్టాలను నిలిపివేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

నంద్యాల(అర్బన్): సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం పట్టణ శివారు ప్రాంతాలైన నందమూరినగర్, వైఎస్ జగన్ కాలనీ, బుడగజంగాల కాలనీలకు చెందిన అంగన్‌వాడీ చిన్నారుల తల్లులకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో డెంగీ, డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని.. జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా భోజనానికి ముందు తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విరేచనాలు, నీరసం ఉంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటితో కలిపి తీసుకోవాలని తెలిపారు. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చూపించుకోవాలని సూచించారు. ఏసీడీపీఓ పద్మావతి, డాక్టర్ రామయ్య, సూపర్‌వైజర్ అనురాధ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి



గాత్రకచేరి నిర్వహిస్తున్న బృంద సభ్యులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వద్ద నెల్లూరుకు చెందిన మల్లాది అనూష, బృందం గాత్రకచేరి ఆకట్టుకుంది. శివ శివ శంభో, కాలభైరావాష్టకం, ఆనందామృత, విజయాంబికే, సకల మంత్రముల, అంబావాణీ, గౌరీ మనోహర, వినాయకుని వలెను, జయజయదేవి, మహిషాసురమర్దిని, శ్రీ చక్రరాజ సింహాసనేశ్వరి, కై లాసగిరివాసా, కాళింగనర్తన, దుర్గాదేవి దురితనివారిణి, కామకోటిపీఠవాసిని తదితర గీతాలను అష్టకాలను మల్లాది అనూష తదితరులు ఆలపించారు.



కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నిస్తున్న దరఖాస్తుదారులు



తహసీల్దార్ కార్యాలయంలో గుమిగూడిన దరఖాస్తుదారులు

మొరాయిస్తున్న సర్వర్

- కులం, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం
- పేరుకుపోయిన దరఖాస్తులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

నంద్యాల(అర్బన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే సర్వర్ మొరాయిస్తుండడంతో కుల, ఆదాయ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. దరఖాస్తులు పేరుకుపోయాయి. ఇటీవల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరడంతో పాటు ఎంసెట్, ట్రిపుల్ ఐటీ తదితర పరీక్షలు రాసిన విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉంది. నోటిఫికేషన్ రాకముందే దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కులం సర్టిఫికెట్లు చేతికి అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈనెల 4వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌లు ప్రారంభమవుతుండడంతో ఏం చేయాలో తెలియక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దరఖాస్తులను అప్‌లోడ్ చేసే జూనియర్ అసిస్టెంట్ జనార్దన్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సోమవారం నుంచి మరో కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే సర్వర్ మొరాయింపుతో దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్నా విఫలం అవుతున్నాయి. దీంతో దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. 15 రోజులుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని, అధికారులు స్పందించి సర్వర్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.